


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# 131

**(25 ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"గయ్యాళి** భార్యతో కాపురం కంటే గంగలో దూకడం మంచిది" అని మనకు ఒక సామెత వుంది. గయ్యాళి భార్యతో కాపురం చెయ్యడం కష్టం కావచ్చు. తనువు చాలిద్దామన్నంత విసుగూ రావచ్చు. కాని, కమ్మటి జీవితాన్ని గంగపాలు చేసుకోవడం అంత తేలిక పనికాదు.

అందువల్ల ఒక ప్రక్క ఆ బాధ అనుభవిస్తూనే జీవితాన్ని బలవంతంగా దొర్లించవలసిన అవస్థపడుతుంది. కొందరికి వారి బాధ వారికే అర్థం కావాలి పాపం "గయ్యాళి" అన్నంత మాత్రాన అలా భయపడి పోవాలా ఏంటి? పెద్దపులివంటిదాన్ని పట్టుకుని కోరలు వూడదీస్తున్నారు. గోళ్లు కత్తిరిస్తున్నారు.

"అలాంటివి, చేసుకున్న స్త్రీని చెప్పు చేతల్లో పెట్టుకోలేదా ఏమిటి?" అని ఇవతలవాళ్ళు ఆక్షేపణ చెయ్యవచ్చు. అలాటి అవకాశాలుంటే నిక్షేపంలాగా బాగుచేసుకుంటారు. కానీ నిజానికి అన్ని ప్రయత్నాలు చేసిన తర్వాతనే సుఖ శాంతులకు నీళ్ళు వదులుకుంటారు, ఆయా గయ్యాళులకు చెందిన భర్తలు.

టాల్‌స్టాయ్ ఏమన్నా తెలివి తక్కువ వాడా భార్యకు బుద్దులు చెప్పడం చేతకాదా! కానీ భార్య దగ్గర ఆయనగారి ఆటలేం సాగలేదు. "నను భవదీయ దాసుడు" అన్న వాళ్ళకు మాత్రం తన్నులు తప్పాయా?

భార్యతో అవస్థలు పడటం అదో గ్రహచారం అనుకోవచ్చు. కానీ, దాన్ని ఆంతరంగిక విషయంగా భావించి, తక్కిన వాళ్ళు వూరుకుంటారా? "అసమర్థుడు" "అప్రాచ్యకుడు" "ఆడదానికి లొంగిన హితుడు" ఇత్యాది బిరుదులు తగిలించి వాటిని పాటగా కట్టి పాడుతూ వెంటపడతారు.

"భార్యా భర్తల తగాదాలలోకి మీరు తలదూర్చడం దేనికి? అంతరంగిక విషయాలు అనేకం ఉంటాయి. వాటిలో అంతఃకలహాలు కూడా వుంటే వుండవచ్చు. వీలైతే సర్దుకుంటాం. లేకపోతే పాడు నూతిలో పడతాం? మీ కెందుకు? ", అంటే ఎవరన్నా వింటారా? ఏమన్నానా? ఇంటి చుట్టూ ఒకటే కాకిగోలాయె.

ఈ సందర్భంలో నాకో చిన్న సంఘటన జ్ఞాపకం వస్తోంది. ఒకసారి నేనేదో వూరు వెళ్ళాను. ఒక మిత్రుడు భోజనానికి పిలిచాడు ఆ రాత్రి. సామాన్యంగా అలా వెళ్ళడం అలవాటుగా లేకపోయినా ఏ దురాశ పుట్టిందో ఆ రోజు వారింటికి వెళ్ళాను.

ఆ గృహస్థు నన్ను సావిట్లో కూర్చోమన్నాడు. అక్కడ పదిరోజుల క్రిందటి పాత పత్రిక ఒకటి వుంటే తీసి ఎడ్వర్టయిజుమెంట్లు చదువుతూ కూర్చున్నాను. పది నిముషాల తర్వాత భార్యాభర్తలిద్దరూ తగువు ప్రారంభించారు ఆవిడేదో మెల్లగా అంటిస్తోంది. ఆయన వాటిని అందుకుని పేలిపోతున్నాడు.

నాకు ఏం చెయ్యాలో తోచటంలేదు. పత్రిక క్రింద పారేసి భగవంతుణ్ణి తలచుకోవడం ప్రారంభించాను. లోపల పోట్లాట ఎంతమాత్రం ఆగలేదు. ఇంట్లో ఒక ముసలమ్మ ఉంది. ఆవిడ వంటింట్లో చెంగుపరుచుకుని పడుకుందల్లే ఉంది. ఎక్కడా ఆవిడ వినపడటంలేదు.

దంపతుల పోరాటం సాగుతూనే వుంది. ఇలాటి మంటల్ని వారి అనుభవాలతో వారు ఆర్పుకోవలసిందేగానీ ఏ ఫైరు ఇంజనులొచ్చి ఆర్పుతాయి? జాలిపడి ఎవరన్నా జోక్యం కల్పించుకుంటే ఆ జ్వాలలు ఇంకా పెరిగి పెద్దవుతాయి.

ఇదంతా ఆలోచించి నేను మెల్లగా లేచాను పోదామని. వెళ్ళడంలో కొంచెం తలుపు చప్పుడైంది. ఆ గృహస్తు వెంటపడ్డాడు. "వెడుతున్నావేం?" అన్నాడు.

ఇంకా దానికో ప్రశ్నా? జవాబు దేనికి?

"వూరికినే వెడుతున్నాను. మళ్ళీ వస్తాను" అన్నాను.

ఆయన అడ్డునుంచుని "అలా వల్లకాదు. నువ్వు భోంచేసి వెళ్ళవలసిందే లోపల ముసలమ్మ వుంది వడ్డిస్తుంది. ఆ డిపార్టుమెంటు వేరు" అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఆతిథ్యం డిపార్టువేరంట. అల్లరి డిపార్టుమెంటు వేరుట. నే వెళ్ళి భోజనం చెయ్యాలిట. "మీరు కానియ్యండి. నేను కొంచెం ఆగివస్తాను. సిగరెట్లు కొనుక్కోవాలి" అన్నాను.

"సిగరెట్లు కావాలంటే నేను తెస్తాను. లేచి భోంచెయ్యండి" అన్నాడు.

"మరి మీరు" అన్నాను.

"నేనీ పూట చెయ్యను. మా పోట్లాట మూలంగా మీరు వెళ్ళవలసిన అవసరంలేదు. అది అంతరంగిక విషయం. అసలు మీరవి వినకూడదు. విన్నా పట్టించుకోకూడదు రండి" అని నన్ను లోపలికి తీసుకుపోయి పీటమీద కూర్చోపెట్టాడు.

తను సిగరెట్లు తెస్తానని బజారువెళ్ళాడు. ఆ విధంగా పావుగంట "సీజు ఫైర్" ఏర్పడింది. ఆ సమయంలో నేను త్వరత్వరగా భోజనం చేసి బయటపడ్డాను. ఆ గృహిణి వంటింట్లో కూర్చుని హార్లిక్సు కలుపుతోంది. బజారు వెడుతూ వెడుతూ గుండెల్లో దడగా ఉందన్నాడుట. ఆ కోమలి హృదయం కరిగిందిట.

ఇలాటి తమాషా తగవులు కొన్ని ఉంటాయి. వీటినే భరించడం కష్టం. ఆ ఇంట్లో కూర్చున్నంతసేపూ "టియర్ గ్యాస్" వదిలి పని అయింది నాకు. అరవడం పెంకులెగిరేలాగా అరిచి ఆతిథ్యం డిపార్టుమెంటు వేరంటాడా పెద్ద మనిషి

ఆవిడ దూరంనుంచి వచ్చే 'ట్రంక్ కాల్'లోలాగా మాట్లాడటం వల్ల సావిట్లోకి ఆవిడ మాటలేమీ వినిపించలేదు. అందువల్ల తప్పెవరిదో కూడా తెలియదు. అలాటి కొంపలకు వెళ్ళడం ముప్పు అనేదొక్కటే తెలిసింది.

పాపం టాల్ స్టాయి సంసారంలో తగవులు ఇలాంటివి కూడా కావు. భర్త ప్రాణాలు కొరికి విడిచేదిట ఆవిడ. ఒక రచయిత ఈ విషయం ప్రస్తావిస్తూ

"బుద్ధుడు జీవిత సత్యాన్ని అన్వేషించడానికి ఇల్లు విడిచి వెళ్ళాడు. టాల్‌స్టాయ్ మృత్యువును అన్వేషిస్తూ ఇల్లు విడిచి వెళ్ళాడు" అన్నాడు.

చాలా రోజులు వెర్రివాడిలాగా ఆ ఊరూ, ఈ ఊరూ తిరిగి తిరిగి చివరకు ఆ మహా రచయిత ఒక రోడ్డు ప్రక్క పడి ప్రాణాలు వదిలిపెట్టాడుట. పోయేముందు అతడు ఒక్కటే కోరిక కోరాడుట. 'నా భార్యను మాత్రం కళేబరాని దగ్గరికి రానియ్యకండి. మృత్యువులో వున్న ప్రశాంతత కూడా నశించిపోతుంది' అనేదే ఆయన కోరిక.

జగత్తు నంతటిని గజగజలాడించిన నెపోలియన్ భార్యను చూచి గజగజలాడేవాడుట. అంతటి సార్వభౌముడు, ఆమెతో కలిసి జీవించడం 'చచ్చిన చావు' క్రింద భావించి ఎంతో బాధపడ్డాడుట.

ఎప్పుడూ ఆయన మాట పాటించిన ప్రాణాన పోలేదుట. అతడు ఏదైనా బోధించి, కొంత సామరస్యం కల్పించుకోవాలని ప్రయత్నించినా లెక్కచేసేదికాదుట. పైగా అంతవాడి నెత్తిన ఎప్పుడూ తిట్లు గుమ్మరించేదిట. పోనీలెమ్మని వూరుకుంటే అవకాశం దొరికిందికదా అని దుమ్మెత్తి పోసేదిట.

ఈ రగడ రాజమందిరంలోనే కాదు. దర్బారులో కూడా సాగేది. ఆయన ఏవో రాజకీయాలలో మునిగివున్న సమయంలో పెద్ద తుఫానులాగా వచ్చిపడేదిట. వచ్చి వూరుకునేదా? "ఏం ఏ వన్నెల విసినకర్రతో కులుకుతున్నావు?" అని అంతమందిలో అడిగేదట. అతడు ఏం చెయ్యాలో తోచక, బిక్క చచ్చిపడివుండేవాడుట.

ఇంటి గయ్యాళుల కథలు చాలా వున్నాయి. వీడు కల్పించిన "లోక కల్యాణాలు" యుగయుగాలవరకు నిలిచిపోతాయి.

Post your comments